# ప్రవాసము

శ్రీ మురయా

ఇక నేనెట్లా బ్రతకాలి? నాకు దిక్కెవరు? నాకు దారేమిటి? అని మళ్ళా మళ్ళా అనుకొంటూ దీర్ఘ నిశ్వాసాలు విడుస్తూ పూరి గుడిసె ముందు కూర్చుని ఉండి పోయాడు పేరయ్య. పొర్లి పొర్లి వస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడుస్తూ మధ్య మధ్య కళ్ళ నీళ్ళు తుడుచు కొంటున్నాడు.

సూర్యుడు పగలంతా ఆకాశంలో ప్రయాణం చేసిచేసి పశ్చిమాన చింతతోపు వెనుకగా అస్తమించబోతున్నాడు. చింతతోపంతా ఎఱ్ఱ వారింది. చింత చిగుళ్ళు ఎఱ్ఱని సూర్యకాంతులలో మెరసి పోతూ గాలికి కదులుతూ కులుకుతున్నాయి.

కాని, పాపం, పేరయ్యకు సూర్యుడస్తమించబోతున్నాడన్న విషయం పట్టనే లేదు. అవును సూర్యుడుదయించునప్పుడావిషయంపట్టిందా ఇతనికి, ఇప్పుడు ఈవిషయం తెలియడానికి. అసలు అతనికి తిండివిషయ మొకటి పడితేగదా ఇతర విషయాలు పట్టడానికి. తండ్రి పోయిన ఆరెండు రోజుల్నించీ అతనల్లాగే వున్నాడు.

పేరయ్య తండ్రి వెంకన్న కాపు మొదట్లో కొంత కలవాడే. రెండెకరాల స్వంతిభూమీ, కవులుకు పుచ్చుకొన్నది మరి కొంతా కలుపుకొని వ్యవసాయం చేసుకొంటూ కృష్ణాపురంలో జీవనం గడుపుతూ వచ్చాడు. ఎగుడు దిగుళ్ళు లేకుండా సంసారం సాఫీగానే సాగింది సాగినంతకాలం. పద్నాలుగేళ్ళ క్రిందట పుట్టిన పేరయ్య తరువాత మళ్ళీ సంతానం కలుగకపోయినా ఆవిషయమై వెంకన్న ఎన్నడూ ఏమీ అనుకోలేదు. అతనూ అతని భార్యా పేరయ్యను ఎంతో గారాబంగా పెంచుకొన్నారు.

కాని పాపం వరుసగా నాలుగేళ్ళు పొలాలు పండక పోయేసరికి వెంకన్న అప్పులపాలైపోయాడు. కష్టాలన్నీ ఒక్కసారే వచ్చాయి. భార్య జబ్బుపడి మంచాన పడ్డది. ఆమెకు వాడిన మందులకూ మాకులకూ బోలెడు ఖర్చయింది. చివరకో రోజున ఆమె తను గారాబంగా పెంచుకొంటున్న కొడుకునూ, తన జబ్బు నయం చేయించాలని తాపత్రయ పడుతున్న భర్తనూ వదలి వేసి వెళ్ళిపోయింది.

అంతే—ఆవిడచావుతో ఆ కుటుంబం కూలి పోయింది. వెంకన్నకు అప్పటికే వయసు మళ్ళింది. ఇటు భార్య మరణానికీ అటు అప్పులవాళ్ళు పెట్టే బాధలకూ వేగలేక అటు అప్పులుతీర్చే మార్గాంతరాలు కన్పించక, ఇటు ఇల్లు దిద్దుకొనే దారి తెలియక దిగులుపడి దిగులుపడి మంచాన పడ్డాడు. చివరకు తనకున్న పొలంఅంతా అప్పుల వాళ్ళకు వ్రాసి ఋణ విముక్తుడయ్యాడు. దాంతో దారిద్ర్య మా యింట్లో తాండవించింది. అతరువాత మూడు నెలలకు తాను దారిద్ర్యమనుభవిస్తూ దాన్నే కొడుక్కు ఆస్తిగా మిగిల్చి పరలోకాల్లో సంపదలూ, దారిద్ర్యమూ అనేవి ఉంటాయో ఉండవో చూద్దామని వెళ్ళిపోయాడు.

అప్పటిదాకా తల్లి దండ్రులచాటున గారాబంగా పెరిగి ఒక్కసారి దిక్కులేనివాడై పోయేసరికి పేరయ్యకు ఏంచెయ్యాలో, ఈ ప్రపంచంలో ఎల్లా బ్రతికాలో పాలు పోలేదు అందుకనే అతనల్లా ఏడుస్తూ కూర్చుండి పోయాడు. పొలం వెళ్ళి తిరిగి వస్తూ చింతతోపుకు దగ్గరగా వున్న వెంకన్న గుడిసెముందుగా వెడుతూ పేరయ్యను చూచారు రామయ్యగారు.

'అదేమిటిరా అబ్బీ! అసురసంధ్యవేళ అల్లా ఏడుస్తూ కూర్చున్నావు' అంటూ దగ్గరకు వచ్చి కాసేపు ఓదార్చి "చూడ్రా అబ్బీ! మనబోటివాళ్ళకు జరిగిపోయినదానికి ఏడుస్తూ కూర్చుంటే ఎల్లా గడు

స్తుందిరా? ... అదంతా మర్చిపోయి, పోయి ఏదైనా కష్టం చెయ్యి. భుక్తి గడుస్తుంది. లేలే!" అని అతని చేతిలో ఓ రూపాయ పెట్టి రామయ్యగారు వెళ్ళిపోబోతుంటే పేరయ్య అమాయకంగా "ఏమండీ రామయ్యగారూ! ఎవర్ని అడగమంటారండీ? ఇప్పుడెవర్ని అడిగినా పని దొరికేటట్లు కన్పించటం లేదు. కాస్త మీరే ఎక్కడైనా నన్ను ఏదో పనికి కుదర్చండీ?" అని అడిగాడు. ఆయన కొంచెం విసుక్కుంటూ "అవన్నీ నే నెక్కడ చూస్తానూ! ఏదో పాపం అని ఓమాట చెప్పాను." అంటూ వెళ్ళిపోతూ నాలు గడుగులు వేసి మళ్ళీ వెనక్కు తిరిగి "చూడు పేరయ్యా! మనవూళ్లో మంచినీళ్ళకు చాలా ఎద్దడిగా వుంది కదా!..... నువ్వు ఓపని చెయ్యవచ్చు; ఓ కావడి వేసుకొని, మనపొరుగున వున్న మంచినీటి బావికి వెళ్ళి నీళ్ళు తెచ్చి పదిమంది ఇళ్లల్లో పోస్తే అదో జీవనాధారం కాకపోదు. చూడూ అదే మంచిది—అల్లా చెయ్యి—నీకు కావాలీ అంటే కావడీ కుండలూ నేనిస్తానుగా—గా! ఈపూట మాయింట్లో నే భోజనం చేసి రేపు తెచ్చుకొందువుగాని" అని చెప్పి కిర్రుచెప్పులు చప్పుడు చేసుకొంటూ రామయ్యగారు వెళ్లిపోయారు.

రామయ్యగారు వెళ్లిపోయిన తర్వాత పేరయ్య కొంతసేపు ఆలోచించాడు. ఎంత ఆలోచించినా అంతకంటే వేరే ఉపాయం తోచలేదు. "సరే ఇప్పటికిదే బావుంది" అనుకొని అందుకు సిద్ధమయ్యాడు. మరునాడు ఉదయాన్నే దానికి కావలసిన ఏర్పాట్లు పూర్తిచేసుకొన్నాడు.

ఊళ్లోకల్లా వీరయ్య చౌదరిగారూ, సుబ్బయ్య నాయుడుగారూ—ఈ యిద్దరే భాగ్యవంతులు. మూడోవాణ్ణి చెప్పుకోవాలీ అంటే ఆవూరి షావుకారును చెప్పుకోవాలి. పేరయ్య వీళ్ల ముగ్గురి విషయమై ఆలోచిస్తూ—"ఈముగ్గురి యిళ్లల్లోనూ కుదరిందీ అంటే, ఇహ తిండి గడుస్తుంది" అనుకొంటూ ముందు నాయుడిగారింటికి వెళ్లాడు. ఆయన వీధి అరుగుమీద కూర్చుని పళ్లుతోముకుంటూనే "ఏరా పేరయ్యా ఇల్లా వచ్చావు... అవును పాపం అంతా అల్లా జరిగిపోయింది.... పాపం చివరి కల్లా జేసి పోయాడు వెంకన్న—సరే గానీ మరిప్పుడేం చేద్దామనుకుంటున్నావు?"

అంటూ పలకరించారు. పేరయ్య చేతులు కట్టుకొని నిలబడి చాలా వినయంగా తనువచ్చిన పని అంతా చెప్పుకొన్నాడు. ఆయన మారుమాట చెప్పకుండా "బిందెకు నెలకు రూపాయి యిస్తాను. ఓ ఐదు బిందెలు పోస్తూవుండు" అన్నారు నాయుడుగారు.

అదేవిధంగా వీరయ్యగారితోనూ చెప్పుకోగానే ఆయనా వెంటనే సరే అన్నారు. "బాగానే వుంది. చూడు పేరయ్యా అల్లాగే చెయ్యి—మన యింట్లో పది పన్నెండు బిందెలు పొయ్యి—చూడూ ముందిక్కడ పని అయ్యాక తర్వాత ఎక్కడైనా పోసుకోవచ్చును" అని చెప్పారు. పేరయ్య సంతోషంగా సరే నండీ అని షావుకారుదగ్గరకు వెళ్లాడు. కొట్టుమీద కూర్చున్న షావుకారు పేరయ్యను చూడగానే "ఏంరా పేరిగా! ఇల్లా వచ్చావూ! సరుకేమైనా కావాలా? పట్టుకెళ్లు; కాని అప్పుమాత్రం పుట్టదు. అసలు అప్పు ఇవ్వటమంటే నాకు గిట్టదని నీకు తెలుసుగా" అన్నాడు.

"అబ్బే అదికాదండీ - విషయమేమిటంటే... అంటూ తన సంగతంతా చెప్పుకొన్నాడు. అల్లాగని చెబుతూ చూడండి షావుకారుగారూ! ఏదో ఈవూళ్లో పుట్టి పెరిగాను; ఏదో విధంగా బ్రతకాలా ...వాళ్లిద్దరూ సరే అన్నారు; మీరో నాలుగు బిందెలు పోయించుకొన్నారంటే నాకేదోవిధంగా తిండికి గడుస్తుంది. "ఆ బాగానే వుంది; నేనూ అనుకొంటూనే వున్నా... మొన్న వాడు లేడూ—ఆ గోపాలంగాడు వాడు పోస్తానన్నాడు. ఊళ్లో అందరికీ అవసరం కానప్పుడు నాకుమాత్రం దేనికీ అని ఊరుకొన్నా—నువ్వేదో బ్రతిమాలుతున్నావా ... సరే పొయ్యి నాకూ నాల్గు బిందెలు. బిందె అర్ధరూపాయికాడికి చేసి పొయ్యి" అన్నాడు షావుకారు.

అదేమిటండీ షావుకారుగారండీ! వాళ్లకో రేటూ మీకో రేటూనా అండీ... అది ధర్మమేనా! ఏదో నామీద దయవుంచి మీరూ ఆకాడికే పోయించుకోండి" అన్నాడు పేరయ్య బ్రతిమాలుతున్నట్లుగా.

"అబ్బే - ఆకాడికి నాకు గిట్టదురా!" అన్నాడు షావుకారు—అదీ ఒక వ్యాపారంలాగానే. కాని పేరయ్య అతన్ని వదలలేదు. చివర కిద్దరకూ

ఒక ఒప్పందం కుదిరింది - బిందె ముప్పావలాకు పోసేటట్లూ ఆవార అతనికిచ్చే సరుకులో షావుకారు కొంత లాభం తగ్గించుకొని ఇచ్చేటట్లూ.

ఆ మరునాటినుండే పని మొదలుపెట్టాడు పేరయ్య. తెల్లవారకముందే నాలుగు గంటలకల్లా లేచి బావికి వెళ్లి నీళ్లకావడి భుజాన పెట్టుకొని ఉరుకులు పరుగులు తీస్తూ, ఈల వేసుకొంటూ ఊళ్లోకి వచ్చేవాడు. పని మొదలు పెట్టాక విచారం అంతా పోయింది. మొదట్లో బావినుంచి పది పన్నెండు సార్లు తిరగడమంటే అట్టే కష్టమనిపించలేదు. అందువల్ల ఇంకా కొన్ని చిన్న చిన్న బేరాలు వస్తే కాదనలేదు. మొత్తం మీద నెలకో ముప్పయి రూపాయలు గిట్టుతూవచ్చాయి. పని ఎక్కువయినకొద్దీ పూర్వంకంటే ఇంకా పెందరాళే నిద్రలేవడం నేర్చుకొన్నాడు. ప్రొద్దున మూడు గంటలకు మొదలు పెడితే మధ్యాహ్నం పదకొండు గంటలకల్లా పని పూర్తియ్యేది. ఇంటికి వస్తూ దారిలో అక్కడా అక్కడా కాసేపు ఆగి పన్నెండు కాకముందు గుడిసె చేరుకొని అప్పుడు కాసిని బియ్యం పప్పు వుడకేసుకొనేవాడు.

పేరయ్యకు మొదట్లో - చిన్నదే అయినా బావురుమంటున్న ఆ గుడిసెలో ఒంటరిగా భోజనం చెయ్యడమన్నా, నిద్రపోవడమన్నా ఏదో దిగులుగా వుండేది. కాని క్రమంగా అలవాటయి పోయింది. మెల్ల మెల్లగా తన కింట్లో కావలసిన వస్తువులన్నీ ఒక టొకటి కొనుక్కున్నాడు పేరయ్య. ఒక నులకమంచం, రెండు గొంగళ్లూ, ఓజత ముతక పంచలూ అవీ కొనడం పడింది.

కావడి కుండల స్థానంలో తెల్లగా మెరుస్తున్న కడవలు వచ్చాయి. కావడిబద్దకు మధ్య మధ్య పట్టీలు వేయించుకొన్నాడు. తర్వాత నాయుడిదగ్గర పదీ పరకా దాచుకోవడం మొదలు పెట్టాడు.

నాయుడుగారు వారి పెద్దమ్మాయి వివాహం ఆయేడే చేశారు. ఆనాలుగు రోజులూ వచ్చిన చుట్టాలకూ స్నేహితులకూ నీళ్లు అవీ అందిస్తూ రాత్రింబవళ్లు అక్కడే గడిపాడు. ఆ నాల్గు రోజులకూ నాయుడుగారు మరో పదిరూపాయలు అదనంగా ఇచ్చారు. అల్లావచ్చిన పదీ గాకుండా పేరయ్యకు మరొకవిధంగా కొంత డబ్బు లభించింది అనుకోకుండా. నాయుడిగారి కొత్తఅల్లుడు స్నానానికి దొడ్లోకి వచ్చి రిస్టువాచీ తీసి బావిగట్టు మీద పెట్టి దానిమీద తువ్వాలుపడేసి స్నానంచేసి తువ్వాల చివాలున లాగేసరికి వాచీ బావిలో పడి పోయింది. అదో పెద్దబావి. అందులోనూ ఉప్పు నీటి బావి కావడంచేత ఆ బావినీటి వాడకం తక్కువ. అందువల్ల అది చాలా లోతు.

కొత్త అల్లుడు చాలా గాబరా పడ్డాడు. వాచీ రెండు వందల ఖరీదు. పైగా పెళ్లిలో పెట్టింది. అప్పుడే పోయిందీ అంటే అందరూ నవ్వుతారు. అందుకని పేరయ్యను పిలిచి వాడికి అనేక విధాల చెప్పి "ఒరేయి నువ్వుగనుక వాచీ తీసియిస్తే నీకు పాతిక రూపాయల బహుమానం ఇస్తానురా" అన్నాడు. పేరయ్య భయపడుతూ భయపడుతూ బావిలో దిగాడు. మొదట్లో లోతు అంతుపట్టలా. అరగంటసేపు నానా అవస్థాపడి మొత్తంమీద ఆ పని సాధించాడు పేరయ్య. కాని ఆ అబ్బాయి డబ్బు యిస్తుంటే ఆడబ్బు చూడగానే అంత డబ్బు తనకు ఎంత కష్టపడితే వస్తుందా అని ఆలోచించాడు. "చూడండి చిన్నయ్యగారూ. డబ్బు మాత్రం ఇవ్వద్దు; అయ్యగారికి తెలిస్తే...అయ్యబాబో...అయినా నాకెందుకూ వద్దండీ" అని వెళ్లిపోతూంటే ఆ అబ్బాయి వెంట వెళ్లి బలవంత పెట్టి "తీసుకోరా! నువ్వు నిజంగా నా పరువు కాపాడావు—అయినా నేనేమైనా కష్టపడి సంపాదించానా ఏమన్నానా.—నాకు పదివేలు కట్నమిచ్చారు—అందులో ప్రస్తుతానికి నాకో వెయ్యి స్వంత ఖర్చులక్రింద చిక్కాయి. పుచ్చుకో... అయినా నేనెవరిలోనూ అనను" అన్నాడు.

చివరకా డబ్బు పేరయ్య పుచ్చుకోక తప్పింది కాదు. ఆడబ్బు కూడా నాయుడిగారిదగ్గరే దాచుకొన్నాడు. ఆ యేడాది చివరిలో అంతా కలిపి నాయుడుగా రతనికి తొంభై రూపాయ లిచ్చారు. ఆడబ్బు బొడ్డులో పెట్టుకొని ఓ రోజంతా ఎంతో ఆనందంగా తిరిగాడు. ఎంతో ఆలోచించాడు. ఓరోజు రాత్రి చౌదరిగారు భోజనానంతరం చుట్ట కాల్చుకొంటూ దొడ్లో మంచంమీద కూర్చున్నప్పుడు వారికి దూరంగా నేలమీద ఆయన కాళ్ల

దగ్గరగా కూర్చున్నాడు పేరయ్య. కొంతసేపయ్యాక పేరయ్య వినయంగా అయ్యగారూ - మీదయవల్ల భుక్తికి ఏలోటూ లేకుండా గడుస్తోంది. మీరందరూ నన్నెంతో దయగా చూస్తున్నారు. అందువల్లనే నాకు ఓ పదిరాళ్లు మిగిలినాయి. ఇప్పుడు నాదగ్గర తొంభై రూపాయ లున్నాయి. దానికి మీరు పదో పరకో కలిపితే నాకోపని చేద్దామని వుంది... ఓ చిన్న పీపాబండి కొందామని వుందండీ..."అంటూ చెప్పుతూ ఆశగా వారివంక చూస్తూ ఉండిపోయాడు పేరయ్య. చౌదరిగారు ఒక్క క్షణం ఆలోచించి "సరేపో వెళ్ళి మన వడ్రంగిని చెయ్యమను; నీదగ్గిర వున్నదంతా ఇచ్చేసి మిగతాది నే నిస్తానని చెప్పి చేయించుకో." అన్నారు.

పేరయ్యకు పట్టరాని సంతోషం కలిగింది. వారిని ఎల్లా అభినందించాలో అతనికి తెలియలేదు. "అయ్యగారూ! ఆ ఋణంలో కొంత భాగం నేను నీళ్ళు పోసి తీర్చుకొంటానండీ" అన్నాడు పేరయ్య. అన్నీ యేడ్చావులే పోరా! పోయి చెయించుకో తర్వాత చూద్దాం మిగతా సంగతులు—సరే ఇహ వెళ్ళు—పోయి పడుకో." అన్నారు చౌదరిగారు. అతనంటే వారికి ఎంతో జాలీ, ప్రేమా వున్నాయి.

పేరయ్య దారిపొడుగునా వీరయ్యచౌదరి గారి దయాగుణాన్ని వేయివిధాల పొగడుకొంటూ, వారికి సంపూర్ణమైన ఆరోగ్యమూ, సంపదా కలుగ చేయమని దేవుడికి పదిసార్లు మ్రొక్కుకుంటూ గుడిసె చేరుకొన్నాడు.

పేరయ్య ఊహించిన దానికంటే వెయ్యి రెట్లు అమరికగా కుదిరింది పీపాబండి. దాన్ని ప్రస్తుతానికి చేతులతోనే లాక్కుపోవడానికీ ముందు ముందు వీలుపడితే ఓచిన్న ఎద్దును దానికే కట్టుకోడానికీ కావలసిన ఏర్పాటుతోనే చేసి యిచ్చాడు వడ్రంగి.

ఒక మంచిరోజు చూచుకొని పీపాకు ముందు నైపు పసుపు కుంకుమలు రాచి, కొబ్బరికాయలు కొట్టి దాన్ని ఊళ్ళోంచి బావికి సంతోషంగా గర్వంగా లాక్కుని వెళ్లాడు పేరయ్య. అతని వయసువాళ్లే ఆ వూళ్ళో సోమరిపోతుల్లాగా తిరిగే కొందరు అతన్ని చూచి ముసిముసిగా నవ్వుకొన్నారు చాటుగా. మరి కొందరు అతని ముఖంమీదే నవ్వారు. కాని పేరయ్య వాళ్ళను అసలు లెక్క చెయ్యలేదు.

కడవలతో తోడిపోస్తే దాదాపు పాతిక కడవల నీళ్లు పట్టింది. చివరి కడవతో నీళ్ళు పీపా మూతిలోకి పోస్తూ "అమ్మ నాయనో—ఇంత బరువు నేను లాగ గలనా" అనుకొన్నాడు. కాని పది పన్నెండుసార్లు అటూ ఇటూ తిరగడం తప్పింది కదా అన్న సంతోషంతో దాన్ని బలంగా లాక్కుపోవడం మొదలు పెట్టాడు పేరయ్య. కాని కొంచెం దూరం పోయే సరికే అలుపు వచ్చింది.

ఆ దారినే ఎడ్లబండీమీద యింటికి పోతున్న రైతు ఇతన్ని చూచి క్రిందకు దిగివచ్చి "అట్లా కాదోయ్ పిచ్చిపేరయ్యా లాగుడుబండీ లాగడం" అంటూ భుజంమీద కాడి ఆనించి ముందుకు నడుస్తూ బండి లాగడం చూపించాడు. ఆ విధంగా చేసి చూసే సరికి పేరయ్యకు పీపా బండిలాగడం చాలా తేలికైన పని అని అనిపించింది. వారం గడవకముందే ఆ బండీ లాగడం అతనికి సులువుగా అలవాటయిపోయింది.

'కష్టపడి పనిచెయ్యాలే గాని ఏదోవిధంగా జీవితం గడవకపోదు' అనుకొన్నాడు పేరయ్య. భుజంమీద కాయలు కాయడం చూచుకొని అవి అప్పుడప్పుడు అసహ్య మనిపించినప్పుడల్లా 'పోనీలే మరేం ఫరవాలేదు. ఇంతలోకే నాకేమీ నామోషీ రాలేదు; కష్టపడి పనిచెయ్యడం నేర్చుకొన్నాను గనుకనే రోడ్లమీద అడుక్కొని తిరిగే దుర్గతి నాకు తప్పింది' అనుకొనేవాడు పేరయ్య. పీపా చేతికి వచ్చాక పేరయ్యకు బేరాలు ఎక్కువయ్యాయి. మొదట్లో ఒక్కసారి వెళ్ళివస్తే సరిపొయ్యేది. ఇప్పుడు రెండు మూడు సార్లుకూడా వెళ్ళిరావలసి వస్తోంది. పాతవాళ్లు తప్ప కొత్తవాడికలవాళ్లు డబ్బు కొంచెం తక్కువ యిస్తున్నారు. అయినా పేరయ్య సంతోషంగా వాళ్ళందరికీ నీళ్లు పోశాడు. ఏడాది తిరక్కముందే పేరయ్య నల్లగా పొట్టిగా బలంగా వుండే ఓ గిత్తను కొనేశాడు. గిత్తను బండికి కట్టి ఆ ఊరిమధ్య వీధిలోంచి బండి తోలుకొని పోతున్న రోజున వాడిహృదయంలో కలిగిన ఆనందం ఇంతా అంతా కాదు. గుడిముందు బండీనాపి—తాడు బండిచక్రానికి కట్టేసి గుళ్లోకి వెళ్లి దేవుడికి వెయ్యి నమస్కారాలు పెట్టి—ఎద్దుకు పసుపూ కుంకుమా

పెట్టె గర్వంగా బావికి తోలుకొనిపోయాడు పేరయ్య. బండీ వూరువదలి డొంకలోకి వచ్చాక దానిమీదకు ఎక్కి కూర్చుని 'అమ్మయ్య ఇప్పటికి నా కష్టాలు గట్టెక్కాయనే అనుకోవచ్చు' అనుకొన్నాడు.

ఒక్కొక్కరోజున ఆ డొంకలోంచి బండీ తోలుకొంటూ వస్తూ "భగవంతుడి దయవల్ల మా వూళ్ళోకి కంకరరోడ్డు పడితే ఎంతబావుండు" అనుకొంటూ వుండేవాడు. ఆ తర్వాత కొన్నాళ్ళు అతని జీవితం బాగా గడిచిందనే చెప్పాలి. నెలకో తొంభైరూపాయల దాకా గిట్టుతున్నాయి.

పేరయ్య కొత్త మంచి బట్టలు వేసుకొని తిరుగుతున్నప్పుడు ఆ వూళ్లో కొంతమంది చూసి నిజంగా సంతోషించారు.

'పోనీలే పాపం. ఓదారినిపడ్డాడు ఇహ ఫర్వాలేదు' అనుకొన్నారు.

అతని యీడువాళ్లు కొంతమంది అతన్ని చూచి 'ఒరేయ్ వాడొట్టి పీనాసినధవరా—కానీ పెట్టి ఓ బీడీకూడా కొనుక్కోడు—ఇంతకుముందెప్పుడైనా డబ్బులు చూసినవాడైతేగా' అనుకొనేవాళ్లు.

బలంకలవాడైనా తనయీడువాళ్ళతో సరదాకైనా దెబ్బలాటలకుపోయేవాడుకాదు పేరయ్య. అందువల్ల పిల్లలు వాడు పిరికివాడని, కొంతమంది పెద్దవాళ్ళు వాడు చాలా బుద్ధిమంతుడనీ అనుకునేవాళ్లు. నాయుడిగారి పొలం చేస్తున్న పెద్దకాపుకోరోజున ఓ మంచి ఆలోచనవచ్చింది. ఆ ఆలోచన తట్టినందుకు తనకుతానే అభినందించుకొంటూ గబగబా ఇంటికి వెళ్లి భార్యతో ఆ విషయం ప్రస్తావించాడు. రెండు నిమిషాలయ్యాక తానొక నిశ్చయానికి వచ్చేస్తూ 'చూడూ! వాడు చాలా బుద్ధిమంతుడు. వృద్ధిలోకి వస్తున్నాడు. మనకంతకంటే మంచి అల్లుడు దొరుకుతాడా?—కుటుంబం విషయమా వెంకన్న బావ విషయం మనం అందరం ఎరుగున్నదే! మన పెద్దమ్మాయి చాలా సుఖపడుతుంది. నువ్వు సంతోషంగా సరే అను" అన్నాడు.

అతనారోజే, వెంటనే వెళ్ళి తన అభిప్రాయం అంతా నాయుడిగారితో చెప్పి అందుకు ఆయన సహాయాన్ని అపేక్షించాడు. ఆయన 'సరే లేరా—నేను చెబుతాలే' అన్నారు. మరునాడు పేరయ్య వచ్చినప్పుడు నాయుడుగారు వాడితో 'చూడు పేరయ్యా—ఇవ్వాళ నీకో విషయం చెప్పాలి. ఆ ఏంలేదు. నువ్వు ఇప్పటికో దారినపడ్డావు. ఏదో నాలుగురాళ్లు సంపాదించుకొంటున్నావు—ఇప్పుడే ఓ యింటివాడివికా. మరోకటే—నీకూ వెనక దిక్కెవరూ లేరా—ఇప్పటికైనా సంసారం అంటూ ఏర్పడితే మంచిది. అదీగాక ఈ వయస్సులో నాలుగుడబ్బులు సంపాదిస్తున్నప్పుడు ఏ పైనా దుస్సహవాసాల్లో పడ్డావా—ఇహ అంతే—కనుక నే చెప్పినట్టుగా పెళ్లిచేసుకో. మన వాడొచ్చి పిల్లనిస్తానంటున్నాడు. నువ్వు ఇంకేమీ మాట్లాడవద్దు. ఆ తర్వాత సంసారానికి డబ్బు కెప్పుడైనా ఇబ్బందివస్తే ఇటు నేనున్నాను—అటు దేవుడులాగా చౌదరిగారున్నారు' అన్నారు నాయుడుగారు.

పేరయ్య ఒక్క నిమిషందాకా ఏమీ అనలేదు. అతని హృదయంలో తను ఎన్నడూ ఊహించని కొత్త ఆనందమేదో ఒక్కసారి పొంగివచ్చింది. కొంచెం సిగ్గుపడుతూ 'సరేనండీ' అన్నాడు. నాయుడుగారీ విషయం చెప్పగానే వీరయ్యగారు విని నిజంగా ఎంతో 'సంతోషిస్తూ మంచిపనే నండీ...ఏదో మీరు పూనుకొని మన పేరయ్యను ఓ యింటివాడ్ని చెయ్యండి.' అన్నారు.

అందరూ అనుకొన్నట్టుగానే పేరయ్యకు ఆ యేడే వివాహమయింది.

చౌదరిగారి దయవల్ల పేరయ్యగుడిసె ఒక చక్కనిపాకగా మారిపోయింది. వారింట్లో పనివాళ్లే వచ్చి పాకవేసి మట్టిగోడలూ దర్వాజాలూ పెట్టి వెళ్లారు.

పెళ్లిఅయిన కొద్దినెలలకే పేరయ్యభార్య కాపరానికి వచ్చింది.

పేరయ్యభార్య నాగమ్మ చాలా చురుకైన పిల్ల. అందగత్తె కాకపోయినా చూడటానికి ముచ్చటగా వుంటుంది. మనిషి చామనచాయే అయినా వయసులో ఉన్నందున నాగమ్మ ఎఱుపనిపిస్తుంది. అన్నిటికంటే ఎక్కువగా పేరయ్య చూసి సంతోషించింది ఆమెలో సహజంగా వున్న సుగుణాలను.

'నాగమ్మ ఎంత మంచిదీ!—ఎంత పొదుపుగలదీ! ఎంత అనుకూలవతీ! ఇంతకంటే నాకేం కావాలీ' అనుకొనేవాడు పేరయ్య.

# ప్రవాసము

కాపరానికి వచ్చిన రెండు నెలల్లోనే సంసారాన్ని చక్కగా దిద్దుకుపోవడం నేర్చుకొంది. ఇంటికి కావలసినవన్నీ సమకూర్చుకొంది.

'నువ్వు వంట ఎంత బాగా చేస్తావే—నాకింత మంచి భోజనం దొరుకుతుందని నే నెప్పుడూ అనుకోలేదు', అంటూ తరచు మెచ్చుకొనేవాడు పేరయ్య.

పొదుపుగా వాడటంవల్ల మిగిలిన డబ్బుతో ఆ యేడాది చివరలో నాగమ్మ ఓ పాడి గేదెను కొనగలిగింది.

ఒకరోజున పేరయ్య గడ్డపెరుగు వేసుకొని తింటూ 'పెరుగు వేసుకొని తినేటంత భాగ్యం కలిగిందన్నమాట—ఓస్ పెరుగేమిటి నువ్వు నాకు దొరకటం అచ్చంగా భాగ్యం కాదూ!' అన్నాడు పేరయ్య నాగమ్మవంక చూసి నవ్వుతూ. 'అహ! అల్లాగేం?' అంటూ ముసిముసి నవ్వులు నవ్వుతూ సిగ్గుపడింది.

పేరయ్యకు తనముందు ముత్యాలు వెదజల్లినట్లనిపించింది.

పేరయ్యసంపాదన నిరాటంకంగా సాగిపోతోంది. ఆరోజు కారోజు ఆవృత్తి లాభదాయకంగా కన్పిస్తూ వచ్చింది. తిండికి సరిపోగా తనకూ నాగమ్మకూ బట్టలు కొనుక్కోగా డబ్బు కొద్దిగా మిగులుతుండేది. కష్టపడినకొద్దీ లాభం కన్పించింది. లాభం కన్పించినకొద్దీ కష్టపడటం అలవాటు చేసుకొన్నాడు పేరయ్య. అక్కడ బావిదగ్గిర అన్ని కడవల నీళ్ళు తోడిపొయ్యడం—ఊళ్లో ఆ నీళ్లు మోసుకొనిపోయి ఇళ్లల్లో పొయ్యడం—ఇదంతా నిజంగా కష్టమైన పనే. కాని పేరయ్యకు అలవాటయిపోయింది. 'ఏదైనా ఇంతే—అలవాటులో వుంది. కష్టమేమిటీ నా మొహం; దేవుడు నాకు బలాన్నిచ్చింది కష్టపడటం కోసం కాదూ!' అనుకొనేవాడు పేరయ్య తను ఎక్కువ కష్టపడుతున్నానేమో అన్న ఆలోచన వచ్చినప్పుడల్లా.

అప్పుడప్పుడు అతని భార్య నాగమ్మకూడా ఆ విషయమై అంటూ వుండేది. 'నువ్వు మరీ ఎక్కువగా కష్టపడుతున్నావు. మరింక క్రొత్త బేరాలేమీ వొప్పుకోవద్దు. డబ్బు అవసరమేననుకో. చూడూ నీకో విషయం చెప్పాలనుకొంటున్నాను. ఇక్కడ నేను వెన్న తేలిగ్గా పోగుచేయగలను. అది కాచి బస్తీకి పట్టుకెళ్లి నాలుగయిదు ఇళ్లల్లో వాడుకలు పెట్టుకొని వస్తా. అందువల్ల తక్కువ శ్రమతో మనకు ఎక్కువ లాభం వస్తుంది. ఏమంటావూ?' అని అడిగింది నాగమ్మ.

'అబ్బే—అటువంటి పనులు నువ్వేమీ చెయ్యొద్దు. నేనేదో కాస్త సంపాదిస్తున్నానని మీ అయ్య నా చేతుల్లో పెట్టాడు సుఖపడతావని. ఈ పనులన్నీ ఆయనకు తెలిస్తే ఆయన చాలా నొచ్చుకొంటాడు. వద్దు—వద్దు—అంతగా మన కింకా డబ్బు అవసరమైతే—ఇంకా కాస్త కష్టం నేనే చేస్తాను." అన్నాడు పేరయ్య.

ఆ విషయమై వాళ్లిద్దరి మధ్యా కొంత వివాదం జరిగింది. కాని నాగమ్మ అతని కా విషయం కేవలం ఇష్టంలేదన్న సంగతి గ్రహించాక మళ్ళా ఏమీ అనలేదు.

తర్వాత వాళ్ళిద్దరూ ఆ విషయమై మర్చిపోయి మామూలు ధోరణిలో పడ్డారు.

ఆయేడే కృష్ణాపురంలో కొన్నిమార్పులు జరిగాయి. వీరయ్యగారూ సుబ్బయ్యగారూ ఇద్దరూ కలసి చాలా కృషిచేసి పైవాళ్లకు నచ్చచెప్పి కృష్ణాపురంనుండి బస్తీకివెళ్లే పెద్ద రస్తాకు రోడ్డు వేయించారు. కృష్ణాపురంకు దక్షిణంగా మైలుదూరం వెళితే బస్తీకి వెళ్ళే కంకరరోడ్డు వస్తుంది. అక్కడదాకా రోడ్డువేయించుకొనేసరికి కృష్ణాపురంనుంచి బస్తీకి సరాసరి రోడ్డుపడినట్లయింది.

దాంతో ఆ వూళ్ళో జనం అంతా పొంగిపోయారు. మరీ పేరయ్యకు పట్టరాని సంతోషం కలిగింది. తను నీటిబావికివెళ్లేదారే అది. దాదాపు మైలు దూరం హాయిగా రోడ్డుమీదే బండితోలుకొని పోవచ్చును. పూర్వం డొంకలోబడి రావడమంటే కొంత బాధగాఉండేది. కాని యిప్పుడో! బలే—చక్కగా రోడ్డుపడింది. "హైయ్" అనంగానే గుఱ్ఱంలా పరుగెడుతోంది ఎద్దు. అందుకని పేరయ్య అందరితోనూ వాళ్లిద్దర్నిగురించీ గొప్పగా చెప్పుకోవడం మొదలుబెట్టాడు. ఊళ్లోఅందరూ చెప్పుకొంటూనే ఉన్నారు—కాని వాళ్ళల్లో కొందరు నాయుడుగార్నీ మరికొందరు వీరయ్యగారినీ ప్రత్యేకంగా మెచ్చుకోవడం మొదలుపెట్టారు.

నాయుడిగారి అల్లుడూ—జిల్లాబోర్డు ప్రెసిడెంటుగారి కొడుకూ ప్రాణస్నేహితులు. సుబ్బయ్యగారు తన అల్లుడితో అతనికి చెప్పించి తద్వారా ఈ పని సాధించారు. లేకపోతే ఇది అయ్యేదా!" అని నాయుడిగార్ని గురించి మెచ్చుకొనేవాళ్లంటే—అదేం కాదోయ్ — వెర్రివాళ్లల్లారా — చూశారూ మన వీరయ్యగారి పెద్దకొడుకు—డాక్టరు చేస్తున్నాడే ఆయనా మన జిల్లా కలక్టరుగారూ మంచి స్నేహితులు. వీరయ్యగారు తద్వారా కలక్టెరుగారికి చెప్పించి వారిచేత సరాసరి ఆర్డర్ వేయించేశారు. కాకపోతే మరొకరి తరమా!' అంటూ వీరయ్యగారిని మెచ్చుకొనేవాళ్ళు అనడం మొదలుపెట్టారు. ఇట్లా వివాదాలు కొన్ని తలలెత్తాయి.

ఈ మాటలు ఆనోటా ఆనోటా బడి వాళ్లదాకా కూడా వెళ్ళాయి. కాని వాళ్లిద్దరూ ఏమీ అనకుండా అల్లా అనుకొనేవాళ్ల అమాయకత్వానికి లోలోపల నవ్వుకొని ఊరుకొన్నారు.

కృష్ణాపురంనుంచి బస్తీకి రోడ్డు పడటంతోటే వచ్చినవని చెప్పాలి ఆ వూళ్ళో కలతలు. ఇప్పుడు అప్పుడప్పుడు బస్తీనుంచి చిన్నకార్లలో నాయుడిగారింటికో చౌదరిగారింటికో పెద్దవాళ్ళు రావడం మొదలుపెట్టారు.

సుబ్బయ్యగారింటికి గానీ వీరయ్యగారింటికి గానీ కార్లో ఎవరొచ్చినా వూళ్ళోవాళ్ళ సంగతి ఎల్లా వున్నా పేరయ్యమట్టుకు ముందుగా సంతోషపడేవాడు.

"మాశావురా రోడ్డుపడింది గనుక మనవూరికి ఇంతమంది పెద్దవాళ్లు వస్తున్నారు" అంటూ కనపడిన వాళ్లందరితోనూ చెప్పేవాడు.

పోరా పిచ్చిపేరయ్యా—ఏమిటి మనవూరికి సరే పెద్దవాళ్లే వస్తున్నారనుకో—వస్తే మన కొరిగిందేమిటీ అంట?" అనేవాళ్లు వాడి మాటలు విన్నవాళ్లంతా.

కాని పేరయ్యదృష్టిలో అల్లాకాదు. ఆ వచ్చిన వాళ్లు ఊళ్లో అడుగు పెట్టినప్పటినుంచి వెళ్లిపోయేదాకా వాళ్లకు తనకు చేతనైన సేవ అల్లా చేసేవాడు. వెంట తీసికొనివెళ్లి ఊరు నాలుగుమూలలూ చూపించి వచ్చేవాడు—తన ఊరునుగురించి వెయ్యివిధాల మెచ్చుకొంటూ. ఒక రోజున ప్రొద్దున్నే పట్నంనుండి పెద్ద ఇంజనీరు ఒకాయన తన బృందంతో పాటుగా వచ్చి తనకు బాల్యమిత్రుడు కావడంచేత నాయుడిగారింట్లో బసచేశాడు. వాళ్లు రెండు చిన్నకార్లల్లో వచ్చారు. వాళ్లవెంట రెండు పెద్ద లారీలుకూడా వచ్చి అక్కడే ఆగాయి.

పేరయ్యకు పట్టరాని సంతోషమైంది. ఆ వచ్చింది పెద్ద ఉద్యోగస్థుడని మాచాయిగా తెలుసుకొన్నాడు. ఇక వాడా రెండురోజులూ పడ్డ హడావిడి ఇంతా అంతా గాదు. వీరయ్యగారింట్లోంచి పెరుగు తప్పాలాలు సుబ్బయ్యగారింటికి చేరవేశాడు. పొలాల్లో అక్కడా అక్కడా పండించుకొంటున్న కూరగాయలు మోసుకొనివచ్చాడు. కొంతమందిచేత అనవసరంగా చివాట్లు తిన్నాడు.

రాత్రి ఒంటిగంటకే లేచి తన నీళ్లపని తెల్లవారి ఆరుగంటలకల్లా పూర్తిచేసుకొని వాళ్లు నిద్రలేచేసరికి అందరికీ వేడినీళ్లు పెటి స్నానాలకు సిద్ధంచేశాడు. వాళ్లు స్నానాలు చెయ్యంగానే వాళ్ల తువ్వాళ్లూ అవీ శుభ్రంగా వుతికి ఆరవేశాడు. ఆపూట మధ్యాహ్నం భోజనాలయ్యాక మిగతావాళ్లంతా వెళ్లిపోయారు. పెద్ద ఇంజనీరుగారొక్కరే ఆపూట కూడా వుండిపోయారు నాయుడిగారి బలవంతం మీద. సాయంకాలమంతా వారావూరు నాలుగు ప్రక్కలా తిరిగిచూసి పొలాలకు పోయివద్దాం రావోయ్" అన్నారు. పేరయ్య ఆయన్ను వెంటబెట్టుకొని అన్నీ చూపించివచ్చాడు.

ఆరోజు రాత్రి ఆయనకు వసారాలో ప్రక్కదులిపివేసి, వారు దానిమీద నడుము వాల్చాక ఆయనకు కాస్త దూరంలో పేరయ్య కూర్చుని వున్నాడు. ఆయన పేరయ్యను హృదయంలో కొంత అభినందించాడు. అటువంటి నౌకరు దొరకడం నాయుడిగారి అదృష్టమనుకొన్నారు.

ఇంజనీరుగారికి అగ్గిపెట్టి అందిస్తూ పేరయ్య వినయంగా "ఏమండీ దొరగారూ!—మీరూ, ఎలక్ట్రీ దీపాలకు సంబంధించిన పెద్ద ఉద్యోగస్థులని మాఅయ్యగారన్నారండీ—నిజమేనాండీ" అని అడిగాడు. ఆయన నవ్వుతూ "అవును: అని ఓనిమిషం ఏదో ఆలోచించి—అవును—అయితే — నీకేమైన మా ఆఫీసులో పనేమైనా కావాలా?" అని అడిగారు.

"అబ్బె! అదేం! వద్దండీ—సుబ్బయ్యగారి దయవల్లా వీరయ్యగారిదయవల్లా నేను ఇక్కడే పొట్ట పోసుకొంటున్నాను. అది కాదండీ—మీకో చిన్న విషయం మనవి చేసుకొందామని వుంది..."అని భయపడుతూ ఆగాడు — తన మనస్సులో ఎన్నాళ్ళ నుంచో తీరనికోరికగా వుంటూ వచ్చినవిషయాన్ని బయటపెట్టడానికి జంకుతున్నవాడిలా. "ఏమిటోయ్—అదీ" అన్నారాయన... పేరయ్య వెంటనే అందుకొని—"ఏం లేదండీ—మావూరికి మీ దయవల్ల ఎలక్ట్రీ తెప్పించేవుపాయ మేదైనావుందా అని తమర్ని అడుగుదామని అనుకుంటున్నానండీ" అన్నాడు కొంచెం నట్టుతూ.

"అదా సంగతి—ఊరివాళ్ళకోసం అడిగే విషయానికి నీకంతభయం కేనికీ— సరే వెళ్ళు అల్లాగేలే—మీ అయ్యగారితో మాట్లాడుతాన్లే."

ఇంజనీరుగారు వెళ్లిపోయేటప్పు డావిషయమై నాయుడిగారితో ప్రస్తావిస్తూ ఇల్లా అన్నారు. "చూడండీ—మేమూ క్రొత్తలైన్లు వేస్తున్నాము. అది బహుశా మీవూరికి ఒకటి రెండు ఫర్లాంగుల దూరంగా వెడుతుంది. మీరంతా—వూళ్లో, ఓ వంద మంది చాలు, సంతకాలుపెట్టి పిటీషను పెట్టుకొంటే మీవూరికి లైట్ల సదుపాయం లభిస్తుంది. అల్లా చెయ్యండి. నావల్ల ఏదైనా అవవలసివుంటే—అది నేను చూసుకుంటాను. అదీగాక క్రొత్తప్లాన్ల ప్రకారం మెల్లమెల్లగా వస్తాయనుకోండీ—మనం కాస్త ప్రయత్నంచేస్తే తొందరగా వస్తాయి," అని చెప్పి ఆయన వెళ్లిపోయారు.

ఆయన్నప్పుడు పంపించి సుబ్బయ్యగారు సరాసరి వీరయ్యగారింటికి వెళ్లి వారితో విషయమంతా చెప్పారు. ఆయన చాలా సంతోషిస్తూ "అల్లాగే కానివ్వవోయ్—మనవూరికి అంత ఉపకారం జరగాలేగాని — అంతకంటె కావాల్సిం దేముందీ" అన్నారు.

వెంటనే ఆవిషయమై వాళ్ళిద్దరూ గట్టి ప్రయత్నాలు చేశారు.

మరో ఆరునెలలకల్లా కృష్ణాపురంలో విద్యుద్దీపాలు మొదటిసారిగా వెలిగాయి.

* * * *

ఊళ్ళోకి దీపాలు రావడంచూచి నలుగురూ నాల్గురకాలుగా మెచ్చుకొన్నారు.

పేరయ్యకిది హృదయంలో లోపల కొంత గర్వకారణమయింది. రాత్రి ఊరికి కొంచెందూరంగా వెళ్ళివస్తూ అక్కడక్కడా మెరుస్తున్న లైట్లవంక చూసి బ్రహ్మానందపడ్డాడు. నిజంగా తన తల్లికి తన కష్టార్జితంలోంచి తీసి విలువగల రత్నాలహారం చేయించి నట్లుగా భావించాడు.

వీరయ్యగారు సంతోషపడుతూ దాన్నిగురించి ఆలోచించారు. "విద్యుచ్ఛక్తి ఎల్లాగో ఊళ్ళోవుంది గదా, చక్కగా రేడియోఒకటి అందరికీ అందుబాట్లో పెట్టించకూడదూ!" అనుకొన్నారు.

మరునాడు నాయుడుగార్ని పిలిపించి "చూడండీ ఎలక్ట్రీ ఎల్లాగో వచ్చిందా, గుడిముందున్న ఖాళీజాగాను చిన్నపార్కులా మార్చి అందులో రేడియో ఒకటి పెట్టుకొందాము"అన్నారు. నాయుడుగారు కొంచెం వెనకాడుతూ "అదంతా డబ్బుతో కూడిన వ్యవహారం—కాస్త జాగ్రత్తగా ఆలోచించండి"అన్నారు.

నాలుగువేలు వేనిస్తాను. మరో రెండో ఒకటో నువ్వు కలుపు. ఊళ్లో కొంత వసూలుచెయ్యండి దాంతో అన్ని ఏర్పాట్లకు సరిపోతుంది. పార్కు మధ్యలో చిన్నగది ఒకటి వేయించి—పార్కుచుట్టూ గోడలు పెట్టించండి," అన్నారు వీరయ్యగారు. సుబ్బయ్యగారప్పటికీ మాట్లాడకపోవడం చూచి వీరయ్యగారు మళ్లీ ఇల్లాఅన్నారు. "చూడండీ మీరేమీ వెనకాడవద్దు—డబ్బువిషయం భయపడకండి. అసలు మీరేమీ ఇవ్వనేవద్దు—అవును విన్నాను. మీ తూర్పు పొలం పండలేదనీ—కొంత అప్పుచేశారనీ—సరే—మరేం ఫర్వాలేదు. మనలో మనకేమిటి—కావల్సింది నేనిస్తాను. పని మీరు పూనుకొని చెయ్యండి —మీరు చూస్తునే వున్నారుగా నాకు క్షణం తీరికలేకుండావుంది...కాని ఒక్క విషయం—డబ్బు అంతా నేనిచ్చానని ఎవరితోనూ అనకండి—అయిన దాంట్లో కొంతకాకపోతే కొంతఅయినా బయటనుంచి రాబడదాము." అని వెయ్యివిధాల చెప్పి నాయుడిగార్ని ఒప్పించి వారిని ఆ పనికి పురమాయించారు.

ఒప్పుకొన్నాక నాయుడుగారూ పనిలో హృదయపూర్వకమైన శ్రద్ధవహించారు.

అనుకొన్న పనంతా మూడునెలల్లో అయిపోవాలన్న నిశ్చయానికి వచ్చారు. పేరయ్యను పిలిచి "ఒరేయ్—చూడూ—ఈపని వెంటనే కావాలి—నువు కాస్త శ్రమఅయినా చెప్పిన పనులన్నీ వెంటనే చేస్తుండు" అని చెప్పారు.

*    *    *    *

ఈ వ్యవహారం మొదలుపెట్టినప్పటినుంచీ చివరిదాకా పేరయ్య నాయుడిగారివెంట తిరుగుతూ సమస్తమైన పనులూ చేసిపెట్టాడు. దగ్గరవుండి రాయి పట్టించుకొనిరావడం. గోడలు కట ్టేటప్పుడు అవసరమైన నీరు సమయానికి అందించడం—ఒకటేమిటి అన్నిపనులూ చేశాడు.

అతను నీళ్లుకొంచెం ఆలస్యంగా పోస్తున్నాడని ఒకళ్లిద్దరు విసుక్కుంటున్నారు. కొందరు ఘట్టిగా కేకలేశారుకూడాను. కాని వీరయ్యగారికి విషయం తెలుసుగనుక ఏమీ అనలేదు. కాని వారింట్లో ఆడవాళ్లు ఊరుకోలేదు.

మొత్తంమీద ఆ మూడునెలల్లోనూ పేరయ్య వళ్ళు హూనం హూనం అయింది. భార్య కొంచెం విసుక్కుంటూ "ఏమిటయ్యా ఇది—ఊరికే వొళ్ళు విరుచుకొంటున్నావు—మన కేమన్నా ఒరుగుతుంది గనుకనా" అన్నది చాలాసార్లు. అనుకొన్నట్లుగా సరిగ్గా మూడునెలల్లో పని సమస్తమూ పూర్తయింది.

ఒకరోజున సుబ్బయ్యగారు వీరయ్యగారిని వెంటబెట్టుకొని వచ్చి పార్కూ—రేడియోగదీ—అన్నీ చూపించారు. ఇద్దరూ ఒకళ్ళనొకళ్ళు అభినందించుకుంటూ సంతోషించారు. మరు నిమిషంలో వెనక్కు తిరిగి వాళ్లకు దూరంగా నిలబడివున్న పేరయ్యను మెచ్చుకొన్నారు, వాడు పడ్డశ్రమకు.

పార్కుకు ప్రారంభోత్సవం చేయించడానికి సుబ్బయ్యగారు స్వయంగా వెళ్లి వీరయ్యగారి పెద్దకొడుకు—డాక్టరుగార్ని వెంటబెట్టుకొని తీసికొని వచ్చారు. ఆరోజు ప్రొద్దున్న బీదవాళ్లకు అన్నదానం చేయించారు. సాయంకాలం ఓ చిన్న సభకూడా ఏర్పాటు చేయించారు.

ఆ సభలో డాక్టరుగారు మాట్లాడుతూ మన గ్రామాన్ని ఇన్ని విధాల అభివృద్ధిలోకి తీసికొని వస్తున్న నాయుడిగారికి మీ అందరితరఫునా నా హృదయపూర్వక అభివందనాలు అంటూ వార్ని వేయివిధాల పొగిడారు.

దాంతో ఆ వూళ్ళో అందరూ ఈ సత్కార్యాలన్నీ నాయుడుగారే సాధించారనీ—ఆయన దేవుడనీ చెప్పకోవడం మొదలుపెట్టారు. మరీ ఆ వూళ్లోవున్న అమ్మలక్కలంతా విడ్డూరంగా చెప్పకొంటూ నాయుడుగార్ని విపరీతంగా మెచ్చుకున్నారు. పదిరోజులపాటువుండి వెళదామని వచ్చి అక్కడేవుండిపోయిన వీరయ్యగారి పెద్దకోడలుకు వాళ్ల మాటలన్నీ వింటూంటే అరికాలమంట నెత్తికెక్కింది. అందరి దృష్టిలోనూ ఆ నాయుడుగారూ—ఆయన లోకంగా తిరుగుతున్న ఆ పేరయ్యా మరీ యిష్టులైపోవడం ఆవిడకు ససేమిరా సరిపడలేదు.

అందువల్లనే వాడిమీద ఫిర్యాదులు ఈమధ్య మరీ ఎక్కువయ్యాయి. "అందరి యిళ్లల్లోనూ పోసిగాని వాడిక్కడ పొయ్యడంలేదండీ" అంటూ వీరయ్యగారికి వంటయింట్లోంచి ఫిర్యాదులు అందుతున్నాయి. వీరయ్యగారి పెద్దకోడలికి ఎందుకనో పేరయ్యమీద ఆగ్రహం కలిగింది. కాస్త అవకాశం కన్పించినప్పడల్లా వాణ్ణి నాలుగూ దులిపేసేది. ఎడా పెడా చీవాట్లు పెట్టేది. అనవసరంగా నోరుపారేసుకొనేది. కాని పేరయ్య వినీ వినకుండా తలవంచుకొని వెళ్ళిపోయేవాడు.

అప్పుడప్పడు "ఏమిటి ఆవిడగా రల్లా దొరసానిగారల్లే తిట్టిపోస్తుంటే—సమాధానం చెప్పవేం" అని తన్నుతానే ప్రశ్నించుకొనేవాడు పేరయ్య.

"ఛా నేనేమీ అనకూడదు. పొరపాటున ఏమాట అన్నా అది వారికి చేరుతుంది. నిజానిజాల సంగతి వారికి తెలియదు. వారి మనస్సు కష్టపడుతుంది. నాకు ప్రాణాధారం కల్పించినవారికి అల్లా మనస్సుకు కష్టం కలిగిస్తానా!—వద్దు—ఏదో అంటూంది...అన్నంతమాత్రాన నాకేంపోయిందీ" అనుకొని సమాధానపడేవాడు పేరయ్య. అతను మళ్లీ ఇల్లా అనుకొనేవాడు.

అయినా నువ్వు నౌకరువూ. అటు చూడూ కాడికి ఎద్దును కట్టేశావా—అదిఎప్పడైనా కాస్త బద్ధకంగా నడిస్తే నువ్వు ఊరుకొంటావా? ఎన్ని తిడతావూ! అంతే; నీ స్థితీ అంతే. అదెంత వినయంగా నడుచుకొంటుందో నువ్వూ అల్లాగే మెలగాలి" పేరయ్య

ఇల్లా అనుకొన్నప్పుడు కొంచెం బాధపడినా మరింత వినయంగా తయారయ్యేవాడు.

*          *          *

ఇంతలో ఎవరూ ఆశించకుండానే క్రొత్తగా వచ్చిన శాసనంద్వారా గ్రామపంచాయతీ ఎలక్షన్లు వచ్చిపడ్డాయి.

అన్ని వూళ్లల్లోలాగానే కృష్ణాపురంలో కూడా ఎలక్షన్ హడావిడి హెచ్చిపోయింది. అనుకోకుండానే పార్టీలు ఏర్పడ్డాయి.

నాయుడిగార్ని నిలబెట్టాలని కొంతమందీ—వీరయ్యగారిని నిలబెట్టి గెలిపించాలని కొంతమందీ అనుకొంటూ రెండుగా చీలిపోయారు. దాంతో రెండు పార్టీ లేర్పడ్డాయి. కొంతకాలందాకా వాళ్లల్లో వాళ్లే తగాదాలు పడ్డారు. కాని యిటు నాయుడుగారు గానీ అటు చౌదరిగారు గానీ అసలీ విషయమే పట్టించుకోలేదు. వీరయ్యగారు నిల్చుంటారులే మనకెందుకని సుబ్బయ్యగారూ—సుబ్బయ్య గారు నిల్చుంటారులే మనకెందు కొశ్రమ అని వీరయ్య గారూ అనుకొని ఊరుకొన్నారు.

ఇంక ఎలక్షన్లు దగ్గిర పడ్డాయి. ఒక కక్షువాళ్లంతా కలసి నాయుడిగారింటికి వెళ్లి మీరు నిల్చోండి — మిమ్మల్ని గెలిపిస్తామని ఆమాటా ఈమాటా చెప్పి కొంతవరకు సుముఖుల్ని చేసుకొన్నారు.

చివరకు నాయుడుగారు "అయినా ఆయనకు తీరిక వుండదు. ఎల్లాగో నువ్వే వుండవయ్యా—ఆపనులన్నీ కాస్త చూసూవుండవయ్యా అంటారు వీరయ్యగారు. కనుక నాకెల్లాగో తప్పదు" అని యిల్లా అనుకొని వాళ్లతో "సరేలెండి" అన్నారు. ఆవిషయము తాను స్వయంగావెళ్ళి వీరయ్యగారితో చెప్పి వద్దామనుకొన్నారు. కాని ఏదో అశ్రద్ధవల్ల పడలేదు. ఎన్నిమార్లో అనుకొన్నారు. "పరవాలేదులే—వూళ్లో వున్న మనిషితో ఎంతలో చేప్పాలి—అందులో వీరయ్యగారితో ఒక్కమాటచెప్పడం ఏంభాగ్యమ్—ఆయన సరసుడు సరే అంటారు." కాని ఆయన ఇల్లా అనుకొంటూవుండంగానే అనుకోకుండా ఓ అకాంతరం వచ్చి పడింది. అల్లుడికి జ్వరంగా వుందనీ వెంటనే రమ్మనీ మద్రాసునుంచి 'టెలిగ్రామ్' వచ్చింది. వెంటనే ఆయన వెళ్లిపోయాడు. వెళ్లి నెల రోజులదాకా అక్కడే వుండిపోయారు. ఆ నెల రోజుల్లో ఊళ్లో హంగామా అయింది. "నాయుడు గారు సర్వసమర్థుడనీ — ధర్మపరుడనీ — గ్రామోద్ధారకుడనీ—దీపాలు తెప్పించడం, రోడ్డు వేయించడం, పార్కు వేయించి రేడియో పెట్టించడం" అన్ని పనులూ ఆయనే వేయించారనీ — ఇల్లాగా ప్రచారం సాగిపోయింది. అందువల్ల ఆయన్ను లెక్కలేకుండా గెలిపిస్తామని వార్ని నిలబెట్టినవాళ్ళు తమ ఎదుటి కక్షువాళ్లను రెచ్చగొట్టారు.

వీళ్ళుమాత్రం ఊరుకొన్నారా? మెల్లగా ధైర్యంచేసి ఈ మాటలన్నీ వీరయ్యగారిదగ్గరకుమోసి నాలుగు కలిపి సాడీలుచెప్పారు. "చూడండి వీరయ్యగారూ—ఆయనేం ప్రచారం చేయిస్తున్నాడో ... అన్ని ఘన కార్యాలూ ఆయనే సాధించాడట. అందుకని మీకు నిలబడే దమ్ములు లేక నిలబడటంలేదట" అని మెల్లగా పురి ఎక్కించారు. ఆయన మొదట్లో పొండయ్యా మీ మాటలకేం—సుబ్బయ్య అటువంటివాడు కాదు" అని వాళ్లను పంపించివేశారు. కాని వాళ్ళు పదిసార్లు ఆయనచుట్టూ తిరుగుతూ పదిరకాలుగా చెప్పేసరికి ఆయన మనస్సూ మారింది. చివరకు "పోనీ నేను తనకు స్నేహితుణ్ణికదా — ఇదుగోనండీ నేనుంటా ఈమాటని నాకు వచ్చి చెప్పకూడదూ!. చెప్పకుండా వెళ్లి మద్రాసులో కూర్చుని వీళ్లచేత ఇల్లా ప్రచారం చేయిస్తాడూ!" అని అనుకొన్నాడు.

"చూస్తాను ఎల్లాగెలుస్తాడో—నేను నిలబడితే నా కెదురుగా నిలబడే సాహసంఉందా అని" అనుకొంటూ ఆయన దాదాపు ఓ నిశ్చయానికి వచ్చారు. అల్లా అనుకొంటూ ఆయన లోపలకు వచ్చారు. అక్కడ భార్యా కోడలూ కలసి ఆ విషయమే ప్రస్తావించారు. కోడలు కాస్త ధైర్యంచేసి అత్తగారి చాటున నిలబడే ఇల్లా అన్నది. "మీరు మరేమీ అనుకోకుండావుంటే ఓ విషయం చెబుతాను. మన కింత ఆస్తివుండీ—ఇంత హోదావుండీ ఆ సుబ్బయ్యగారికి భయపడటమా! ఆ పేరయ్యమీద ఆధారపడటమా! అసలీ జరిగే ప్రచారానికి మూలకారణం పేరయ్య. వాడి దొంగ వినయంచూసి నేనూ మొదట్లో అందరిలాగే అనుకొని మోసపోయాను. సరే అదంతా ఎందుకులెండి. ఆయనగారేదో సాధించారనే గదా చెప్పుకొం

టున్నదీ—అంతకంటే మంచిపని అందరికీ కన్పడేటట్టుగా మీరు చెయ్యండి!". "సరే బాగానేవుంది—అదే ఏంచేయమంటావ్" అన్నారు వీరయ్యగారేదో ఆలోచనలో పడి. "అదే నేనూ చెప్పబోతున్నా; మన వూరికి మంచినీటి కరువుందా—దాన్ని నివారించండి. దాంతో వూరువూరంతా మనవైపు తిరుగుతుంది. అంతేకాకుండా మాకేమో వాడిమీద—ఆ పేరయ్యమీదా ఆధారపడే అవస్థతప్పుతుంది"అన్నది."అయితే—ఇంతకీ ఏంచెయ్యమంటావమ్మా."అని మళ్లీ అడిగారు వీరయ్యగారు.

"ఏ ముందండీ—నీటికరువు పోగొట్టడ మెంతసేపూ—ఆ బావివుందా—దాన్ని కొస్త పెద్దదిచేసి అక్కడ మోటారుపెట్టి నీళ్ళుపంపుచేస్తే ఊళ్ళోవచ్చిపడతాయి నీళ్ళు. దాంతో ఊళ్ళో గంగ ప్రవహించినట్లవుతుంది. ప్రస్తుతానికి రబ్బరుగొట్టాలు పెట్టించండి. తర్వాత తర్వాత వూరిసొమ్ము పోగయ్యాక మంచివి వేయించుకోవచ్చు" అంటూ కోడలు ఉపాయం చెప్పింది. ఆయన మనస్సుకా ఉపాయం బాగా నచ్చింది. బావుందమ్మాయి—బాగా చెప్పావ్—ఎల్లాగైనా చదువుకొన్న పిల్లవుకదూ" అని మెచ్చుకొంటూ వాకిట్లోకి వెళ్లి ఆ విషయం తనచుట్టూ తిరుగుతున్న వాళ్లతో చెప్పారు. వాళ్లంతా బావుందంటే బావుందన్నారు. అడక్కుండానే తలో అయిదు వందలూ వెయ్యీ చందాగా వెంటనే ఇచ్చేశారు.

అనుకొన్నపని వారం తిరక్కముందే పూర్తికావాలని అందరూ పట్టుపట్టారు.

* * * *

బస్తీనుంచి ఒక ఇంజనీరుగారూ ముప్పైమంది కూలీలూ వచ్చి వీరయ్యగారు తలపెట్టిన పనిని అనుకొన్నదానికంటె ముందుగా చేసిపెట్టి వెళ్లిపోయారు. ఊళ్లో పెట్టించిన పంపులు వదలిపెడుతూ ప్రారంభోత్సవం చెయ్యడానికి ఓ మంత్రిగారిని పిలుచుకొనివచ్చారు.

మంత్రిగారు మరో రెండురోజులకు ఎలక్షన్లున్నాయనగా ఆవూరు వచ్చారు. పెద్దసభ ఏర్పాటు చేశారు వీరయ్యగారి తరఫు మనుష్యులు. ఆ సభలో ఆయన మాట్లాడుతూ వీరయ్యగారి దాతృత్వాన్ని వేనోళ్ల కొనియాడుతూ ఆ వూళ్ళో అంతవరకుదాకా జరిగిన ప్రతి మంచిపనికీ ఆయనే కారకులనీ—ఆ విషయాలన్నీ తనకు మొదటినుంచీ తెలుసుననీ చెప్పారు. ఆ విషయమై రెండు నిముషాలు మాట్లాడి తన పార్టీని గురించీ దేశరాజకీయాలనుగురించీ ఒక పెద్ద ఉపన్యాసం ఇచ్చి చివరకు వీరయ్యగారు తన పార్టీ మనిషనీ వారిని గెలిపిస్తే నిజంగా తన్ను గెలిపించినట్లుగా భావిస్తానని చెప్పి ఉపన్యాసం ముగించారు. టాపులేని చిన్నకారులో ఆయన్ను ఊరేగించి ఘనంగా గౌరవించారా వూళ్లో.

మంత్రిగారు వచ్చిన రోజుననే సుబ్బయ్యగారు కూడా తన స్వగ్రామం తిరిగివచ్చారు. వచ్చీ రావడంతోనే ఆయన్ను, ఆయన్ను గెలిపిద్దామనుకొంటున్న వాళ్లంతా వచ్చి కలుసుకొన్నారు. సుబ్బయ్యగారు, "నా కెందుకయ్యా ఈ గొడవంతానూ—నేను వెళ్లి వారితో చెప్పివస్తాను—నా కక్కరలేదీ పదవి అని" అన్నారు. కాని ఆయనతో" అదేమిటయ్యా ఇందాకా వచ్చాక ఇప్పుడు వెళితే నువ్వెంత లోకువైపోతావూ—అంతకంటే వెయ్యిరెట్లుగా మేమెంత చులకనైపోతామూ!"అంటూ ఆయన్నా రోజల్లా ఇంట్లోంచి బయటకు రానివ్వలేదు.

ఆరోజు సాయంకాలం సభ అయ్యాక విందులూ—భోజనాలూ చాలా కోలాహలంగా జరిగాయి. ఆ మరునాడే నీళ్లపంపులన్నీ ఒక్కసారే వదలిపెడతారనీ—వీరయ్యగారింటిదగ్గిర వేసిన పందిట్లో నిలబడి ఒక చిన్నమీట నొక్కితే అన్ని పంపులలోనుంచీ గంగ ప్రవహిస్తుందనీ వూళ్లో అడవాళ్లంతా వింతగా చెప్పుకొంటున్నారు. ఆరోజు సాయంకాలం వీరయ్యగారింటికి వెళ్లాడు పేరయ్య. వీరయ్యగారి దర్శనమే కాలేదు. వారి కోడలు ఎదురుపడి 'ఒరేయి—పేరయ్యా!—నువ్వింక మా గుమ్మంలోకి రానక్కర్లేదు. నీ నీళ్ళూ అక్కర్లేదు నీసేవా అక్కర్లేదు. వెళ్ళు — వెళ్లి ఆ సుబ్బయ్యగారింట్లోనే పడివుండు" అని ఖచ్చితంగా చెప్పేసింది. నడవలో నిల్చున్న వీరయ్యగారిదగ్గిరకు వెళ్లి పేరయ్య ఆవిషయమై చెప్పుకొన్నాడు.

ఆయనకోపాన్ని మింగుకొంటున్నట్లుగా కనపడ్డారు. అవును బాగానే చెప్పింది. వెళ్ళు. ఇవ్వాళతో నీకూ రేపటితో ఆ సుబ్బయ్యగారికీ తెలిసివస్తుందిలే వెళ్ళు — నాకెదురుగా నిలబడి నా కాళ్లే

కోపం తెప్పించకు" అని ఆయన చరచరా లోపలకు వెళ్లిపోయారు.

పేరయ్య నిర్ఘాంతపోయి ఒక్క నిముషం అల్లాగే నిలబడి బరువై కృంగిపోతున్న హృదయంతో మెల్లగా బయటకు వచ్చేశాడు. మెలగా అడుగులో అడుగు వేసుకొంటూ నాయుడిగారిదగ్గిరకు వెళ్లి విషయమంతా చెప్పుకొన్నాడు. ఆయనా, ఆయనదగ్గిరవున్న ఆయన మిత్రులూ విని "ఏం ఫర్వాలేదులేరా నువ్వు విచార పడకు. మేం చూస్తాంలే" అంటూ ఓదార్పడానికి ప్రయత్నం చేశారు. కాని పేరయ్యకు హృదయం మరింత భారంగా బాధగా కన్పించింది. మాట్లాడ కుండా బయటకువచ్చేసి సరాసరి గుళ్లోకి వెళ్లి అక్కడే చాలాసేపు కూర్చున్నాడు.

రెండుగంటలవుతున్నా ఆకలి వేయలేదు పేర య్యకు. అప్పటిదాకా ఆగుళ్లో ఒంటరిగా కూర్చుని అంతసేపు తానేమి ఆలోచించాడో అతనికే తెలియదు. బయట అక్కడక్కడ కోలాహలంగా వుంది. షావు కారు కొట్టుకు వెళ్లి వద్దామని బయలుదేరాడు. అన్ని పంపులూ అంతకుముందే వదిలారు. చాలా మంది జనం అక్కడక్కడ గుంపులుగూడి సరససల్లాపాలు ఆడుకొంటూ అక్కడే కూర్చునివున్నారు. పేరయ్య వాళ్లందరినీ చూస్తూ చేతులు వెనక్కు కట్టుకొని మెల్లగా ముందుకు నడిచాడు. ఒకచోట కొంతమంది 'ఒరేయి పేరయ్యా' అని పిలిచి దగ్గిరకు వచ్చింతర్వాత ఏరా పీపాబండి పేరయ్యా—చూశావా మరి నీళ్ళు తెప్పించావ్' అంటూ ఎగతాళిచేశారు. పేరయ్య పెదిమ కదల్చలేదు. షావుకారుతో "నీకు నేనేమీ బాకీలేనుసుమా" అని చెప్పి మళ్లా వెనక్కు తిరిగి యింటిదారి పట్టాడు. 'ఓరి పిచ్చి పేరయ్యా—నువ్వు బాకీపడ్డావని ఎవరన్నార్రా" అన్నాడు షావుకారు.

పేరయ్య పార్కుదగ్గిర నిలబడి ఎదురుగా వున్న పంపుకేసి చూశాడు ఓ క్షణంపాటు.

అందరికీ అంగుబాటులోకి నీళ్లురావడం పేరయ్య కోరకంగా ఆనందంగానే వుంది. కాని ఇదంతా తన్ను—ఏడిపించాలని చేసినపని అని స్పష్టంగా తెలుసు.

ఒకసారి పంపుదగ్గరకువెళ్లి కొళాయితిప్పి ఇన్ని మంచినీళ్లు నోట్లో పోసుకొన్నాడు. దానికి గజం దూరంలోవున్న కుండు కన్పించింది. దానిలోకి తొంగిచూస్తూ పేరయ్య ఓ నిమిషం అల్లాగే నిలబడి పోయాడు. ఆ కుండులో అప్పటికే సగానికి నీళ్ళు న్నాయి. దానికి చిత్రంగా అడుగునుంచి నీళ్ళునింపే గొట్టంవుంది. అందులోంచి నీళ్ళు పైకి వస్తున్నాయి. కుండు వేడినీళ్ల కుండలాగా వుడుకుతున్నట్లుగా వుంది. బుడగలు వస్తున్నాయి.

పేరయ్య హృదయమూ అల్లాగేవుందా సమ యంలో. అంతవరదాకా నిర్మలంగావున్న అతని హృదయంలో నిస్పృహా, నిరాశాభావాలు బుడగల్లాగా పైకి తోసుకొనివస్తున్నాయి. అతని హృదయం దుఃఖంతో కృంగిపోయింది. అంతలో కోపంవచ్చింది. మరుక్షణంలో ఆ కోపం మాయమయి దాని స్థానంలో నిస్పృహ ఆవరించింది. పేరయ్య పెద్దపెద్ద అంగలు వేసుకొంటూ తన గుడిసె చేరుకొన్నాడు—ఏదో ఒక నిశ్చయానికి వచ్చి దాన్ని క్షణాలమీద నెరవేర్చ బోతున్నవాడిలాగా.

గుమ్మంలోనుంచే భార్యను పిలిచి "పదవే మనకింక ఈవూళ్లో తావులేదు. ఇవ్వాళతో ఋణం తీరి పోయింది. నన్ను దగ్గరకు తీసి ఆదరించిన పెద్దవాళ్లి ద్దరూ అనవసరంగా మనఃకలహాలు పెంచుకొని చివ రకు నన్నిల్లా చేశారు. పోదామ్పద—మరోవూరు పోదామ్. ఆ నాలుగు గిన్నెలూ ఓ గోతాంలో సర్దే సెయ్యి. గేదెను మీ పుట్టింటికి తోలేసిరా— మరో వూళ్ళో తలదాచుకొందామ్. రాజులకైతే ఒక వూరు గానీ అడుక్కొనేవాళ్లకు ఒక వూరేమిటి.. " అన్నాడు పేరయ్య. నాగమ్మ అతనికెదురుగా నిలబడి అతని కళ్లల్లోకి చూసింది. కనుకొలకుల్లో దాగివున్న కన్నీటిని తేలిగ్గానే గుర్తుపట్టింది. విషయమంతా అంతకుముందే విన్నది. కాని పేరయ్య అంతగా దిగులుపడతాడని అనుకోలేదు. అదేమిటయ్యా—అల్లా దిగులుపడతావ్—కష్టపడేవాళ్లం బ్రతకలేకపోతామా —ఇక్కడే వుందామ్" అన్నది నాగమ్మ.

"కాదు—నేనీవూళ్లో ఇంక తిరగలేను. పద వెళ్లి పోదామ్" అన్నాడు పేరయ్య.

"అదేమిటే తిరగలేకపోవడమేమిటే—నువ్వేం దొంగతనం చేశావా—ఎవరికైనా ఓ పిసరంత అప కారం చేశావా—దేనికీ అంత ఇదవుతావూ?" అని అడిగింది నాగమ్మ.

"అదేమీ కాకపోయినా — నే నుండలేను ఈ వూళ్లో. నా మూలంగా అనేక కలతలూ తగాదాలూ వస్తున్నాయి. అందువల్ల వెళ్లిపోవాలి" అన్నాడు పేరయ్య తేల్చి చెబుతూ.

"పోనీ అల్లాగే వెళదాంలే. రేపటిదాకా వుండి అదేదో ఎవరు గెలుస్తారో చూసివెళదాము. ఒకవేళ నాయుడుగారుగెలిస్తే నీకేదైనా దారి చూపిస్తారేమో!" అన్నది తన హృదయంలో వున్న ఆశాభావాన్ని వ్యక్తంచేస్తూ నాగమ్మ. ఆ మాటలు కొంచెం పరధ్యాన్నంగా వింటున్న పేరయ్య ఒక్కసారి ఉలిక్కిపడి ఇల్లా అన్నాడు. "అమ్మో వద్దు! నాయుడుగారు ఇంక నాకేమైనా చేస్తే అటు వీరయ్యగారికి కోపం వస్తుంది. ఆ తర్వాత వీ రిద్దరిమధ్యా వైషమ్యాలు ఇంకా పెరుగుతాయి. వద్దు ఇవ్వాళే వెళ్లిపోదాము. వా ళ్లిద్దరిలో ఎవరు గెల్చినా నాకొకటే—నా కీయన తల్లీ ఆయన తండ్రీ. లే—అవన్నీ సర్దేసెయ్యి."

"సరే—అల్లాగే వెళదామ్. ఎక్కడైనా బ్రతకలేకపోము. నీళ్లు పొయ్యడం కాకపోతే మరోపని చేద్దువుగాని. అవును పూర్వం నేనోసారి చెప్పానే, అదే, వెన్నా నెయ్యీ అమ్ముకొని పొట్టపోసుకొందాం పద—ఒక్కగంటలో సామాను సర్దేస్తాను" అన్నది నాగమ్మ.

నాగమ్మ మాటలకు పేరయ్య సంతోషించాడు. ఆరోజు చీకటి పడుతుండగా సామానూ గోతామూ పీపామీద వేసి కట్టేసి చేతులో తాడుతో ముందు పేరయ్యా అతనివెనక నాగమ్మా బయలుదేరి ఊరిచివరకు వచ్చేశారు. ఊరు విడిచి రెండు ఫర్లాంగులు వచ్చాక అక్కడోసారి ఆగి వెనక్కు తిరిగిచూచి ఇద్దరూ కళ్లవెంట నీరు పెట్టుకొన్నారు. నాగమ్మ తల్లితోనైనా చెప్పిరాలేదు. పేరయ్య నాయుడిగారితో ఒక్కమాటైనా అనలేదు. ఊరివైపు చూడగానే పేరయ్యకు తను చిన్నతనంనుంచీ తిరిగిన ఆవూరి నాలుగు మూలలూ—వాటితో అల్లుకొనిపోయివున్న కష్టసుఖాలతో కూడుకొన్న జీవితాధ్యాయాలూ అన్నీ జ్ఞాపకం వచ్చాయి.

ఒక్కసారి అనుకోకుండా అతని చెక్కిళ్లపైనుండి కన్నీటి బిందువులు జారాయి.

నాగమ్మ చూడకుండా తువ్వాలకొంగుతో కళ్లు తుడుచుకొన్నాడు. బొంగురుపోతున్న గొంతుతో 'హాయ్!' అని. ఎద్దును అదిలించాడు.